సాక్షి
కర్నూలు
బుధవారం । 30 । ఆగస్టు । 2023



సుంకేసులకు నిలిచిన ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచి పోయింది. ప్రస్తుతం డ్యాంలో 0.719 టీఎంసీల నిల్వ ఉండగా, కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



ఓపెన్ స్కూల్ విద్య వరం

పాఠశాలల్లో రెగ్యులర్ చదువుకునే అవకాశం లేని పిల్లలు, వయోజనులు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగ పదోన్నతులు పొందేందుకు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ వరంగా మారింది. - 8లో..



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, బయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

రేపు వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల సమావేశం

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జీలు, జిల్లా అధ్యక్షులు, ఇటీవలే నూతనంగా ఎన్నికైన పార్టీ జిల్లా కమిటీ ప్రతినిధుల సమావేశం ఈ నెల 31 తేదీన నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ సమావేశం జరుగనుందన్నారు. ప్రభుత్వ పథకాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన యూరప్ పర్యటన నిమిత్తం వెళ్లడంతో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ మౌర్య వ్యవహరించనున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 30 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు కలెక్టర్ విదేశాల్లో వ్యక్తిగత పర్యటనకు వెళ్లారు. ఆమె వచ్చే వరకు ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ వ్యవహరిస్తారు.

వైద్య సిబ్బంది నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మెడికల్ ఆఫీసర్ (డీటీసీ), జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, జిల్లా పీపీఎం కో ఆర్డినేటర్, డాట్స్ ప్లస్ టీబీ–హెచ్ఐవీ సూపర్‌వైజర్, అకౌంటెంట్, ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ (మెడికల్ కాలేజీలు), టీబీ హెల్త్ విజిటర్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్ పోస్టులున్నా యన్నారు.పూర్తివివరాలకుhttps:// www.kurnool.ap.gov.in&https://www.nandyal.ap. gov.in వెబ్‌సైట్‌లలోసందర్శించాలన్నారు.

పోలీసు అధికారులకు స్థానచలనం

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న ముగ్గురు పోలీసు అధికారులకు స్థాన చలనం కలిగింది. కర్నూలు రూరల్ తాలూకా సీఐగా ఉన్న శ్రీనివాసరెడ్డిని కర్నూలు స్పెషల్ బ్రాంచ్‌కు, ట్రాన్స్‌కో విభాగంలో పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి పత్తికొండ రూరల్ పీఎస్‌కు నియమితులయ్యారు. అలాగే విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న జయన్నను కర్నూలు పోలీసు శిక్షణా కేంద్రం(డీటీసీ)కు బదిలీ చేశారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ఆధారంగా వీరి ముగ్గురినీ బదిలీ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

నేడు, రేపు దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తీసుకొచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్ కార్డు ప్రైమ్‌ను నిరసిస్తూ ఆగస్టు 30, 31 తేదీ ల్లో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్‌ను పాటించనున్నట్లు ఏపీ స్టేట్ దస్తావేజు లేఖరుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ రఫీ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కొత్త విధానంతో దస్తావేజులేఖర్ల ఉపాధికి గండిపడుతుందన్నారు.



ధ్వజారోహణను తిలకిస్తున్న భక్తజన సందోహం



విశేష అలంకరణలో రాఘవేంద్రుల మూలబృందావనం

పులకించిన వేదభూమి

- అమర గురువు ఆరాధనకు అంకురార్పణ
- అంగరంగ వైభవంగా సప్తరాత్రోత్సవాలు ప్రారంభం
- ధ్వజారోహణతో శ్రీకారం చుట్టిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు
- ఆకట్టుకున్న పూజోత్సవాలు



ధ్వజారోహణతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల సుస్వరాలు, దాససాహిత్య హరి కీర్తనలు, భక్తజన హర్షధ్వానాల మధ్య చింతామణి సదృశ్యులైన అమరగురువు శ్రీరాఘవేంద్రస్వామి 352వ ఆరాధన వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చేతుల మీదుగా శ్రీమఠం స్వర్ణ బృందావన శిఖరాగ్రాన ధ్వజారోహణ గావించి ఉత్సవాలకు అంకురార్పణ పలికారు. ముందుగా రాఘవేంద్రుల మూల బృందావనంతో పీఠాధిపతి ఆశీస్సులు పొంది అట్టహాసంగా ఊరేగింపుగా ఆలయ ముఖద్వారం ముంగిటకు చేరుకున్నారు. అక్కడ గోపూజ, అశ్వ పూజ నిర్వహించి ధ్వజారోహణ గావించారు. అనంతరం శ్రీమఠం కార్య నిర్వహణ కార్యాలయం చేరుకుని లక్ష్మీపూజ, ఏఏఓ, మేనేజర్-1, మేనేజర్-2 తదితర కౌంటర్లలో పూజలు చేశారు. యోగీంద్ర మంటపం చేరుకుని రాఘవేంద్రుల మైనపు విగ్రహానికి పుష్పార్చన, మంగళ హారతులు పట్టి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఊంజల మండపంలో ప్రహ్లాదరాయలుకు దివిటిగి సేవ చేసి ధాన్య పూజ కానిచ్చారు. రాత్రి 8 గంటలకు శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో అశేష భక్తజనం మధ్య ప్రభోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్, ధార్మిక సహాయ అధికారి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంత స్వామి, సంస్కృత పాఠశాల విశ్రాంత ప్రధానాచార్యులు వ్యాదిరాజాచార్ పాల్గొన్నారు.

సేవలో తరిస్తే మోక్షం : పీఠాధిపతి

రాఘవేంద్రస్వామి సేవలో తరించిన భక్తులకు మోక్ష ప్రాప్తి కలుగుతోందని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రవచించారు. ఉత్సవ అంకురార్పణలో భాగంగా యోగీంద్ర మంటప సభలో ప్రసంగిస్తూ కొలిచే భక్తులకు కొంగు బంగారంగా రాఘవేంద్రస్వామి వర్ధిల్లుతున్నారన్నారు. మహిమతో దేశ విదేశాలకు మంత్రాలయ క్షేత్ర ఖ్యాతి పొందిందన్నారు. రాఘవేంద్రులు సశరీరంగా బృందావన ప్రవేశితులై 352 ఏళ్లు అయ్యాయన్నారు. స్వామి మహిమలకు భక్త కోటి పాత్రులు అవుతున్నారన్నారు. ఏడు రోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా భక్తులకు సకల వసతులు కల్పించామన్నారు. ఉత్సవాల విజయవంతానికి సహకారం అందించే ప్రభుత్వ అధికారులు, శ్రీమఠం నిర్వాహకులకు ఆశీస్సులు పలికారు.



ప్రత్యేకాలంకరణలో ప్రహ్లాదరాయలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఆరాధన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక యోగీంద్ర మంటపంలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్వాన్ హొళగుంది గుండాచార్ దాసవాణి సంకీర్తనలు అలరించాయి. అనంతపురం జిల్లాకు చెందిన శ్రీసాయి నృత్య శిక్షణాలయ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేసింది. పీఠాధిపతి కళాకారులకు ఆశీర్వచనాలు చేశారు. వేడుకలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, దాససాహిత్య ప్రాజెక్టు ఇన్‌చార్జ్ అప్పన్నాచార్, పద్మనాభరావు పాల్గొన్నారు.



వేద పాఠశాల విద్యార్థుల మంత్రోచ్చారణ



కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

క్రీడాకారుల సంక్షేమానికి కృషి

- ప్రతిభావంతులకు ప్రోత్సాహం
- కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం
- స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ కాంస్య విగ్రహా ఆవిష్కరణ
- హాజరైన మేయర్ బీవై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



మేజర్ ధ్యాన్‌చంద్ కాంస్య విగ్రహ ఆవిష్కరణలో కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు (టౌన్): క్రీడాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మేజర్ ధ్యాన్ చంద్ కాంస్య విగ్రహాన్ని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, సీఈఓ రమణతో కలిసి ఎంపీ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్నూలు ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియోజకవర్గ, జిల్లా, రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని చెప్పారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ నగరంలో క్రీడల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు, మున్సిపల్ పాఠశాలలకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం శుభపరిణామమన్నారు. అంతకు ముందు స్టేడియంలో జిమ్‌సెంటర్ ఆధునీకరణకు రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ ప్రకటించారు.

విజేతలకు సత్కారం

క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు వివిధ క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి పతకాలు, షీల్డ్‌లు, మెమొంటోలు అందజేశారు. ఏషియన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న కళ్యాణితో పాటు జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన షర్మిల, అపర్ణ, వీరేష్, పల్లవిని అతిథులు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్టేడియం చీఫ్ కోచ్ శ్రీనివాసరావు, కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, 41 వ వార్డు ఇన్‌చార్జ్ శ్వేతారెడ్డి, ఒలింపిక్ సంఘం నాయకులు రామాంజనేయులు, దాసరి సుధీర్, గంగాధర్, నాగరత్నమయ్య, ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు ఊరట

- ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.200, ఉజ్వల కనెక్షన్‌పై రూ.400 సబ్సిడీ
- జిల్లాలోని 6.23 లక్షల మహిళలకు 13.25 కోట్ల భారం నుంచి విముక్తి



కర్నూలు(సెంట్రల్): గ్యాస్ వినియోగదారులకు కేంద్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. గృహోపయోగ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.200, ఉజ్వల సిలిండర్‌పై రూ.400 సబ్సిడీ ఇస్తున్నట్లు ప్రకటించింది. తక్షణమే ఈ సబ్సిడీ రేట్లు అందుబాటులో రానున్నాయి. ప్రస్తుతం ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1152 ఉంది. రూ. 200 తగ్గింపుతో వినియోగదారులకు ఊరట కలగనుంది.

జిల్లాలో 6.23 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు

కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతూనే పోతున్నాయి. ముఖ్యంగా పదేళ్ల క్రితం రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1152కు చేరుకుంది. దానికి రవాణా చార్జీలను కలుపుకుంటే రూ.1200 కడితే తప్పా సిలిండర్ ఇంటికి రావడం లేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు గ్యాస్ వినియోగం తీవ్ర భారమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం కేంద్ర కేబినెట్ వంట గ్యాస్ ధరలు తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాలో మొత్తం 6,23,000 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో 39,895 మంది ఉజ్వల కనెక్షన్ దారులు ఉన్నారు. జిల్లాలో ఎల్‌పీజీ సిలిండర్‌ను వినియోగిస్తున్న 5,83,105 మంది మహిళలకు ఒక్కో సిలిండర్‌పై రూ.200 తగ్గింపుతో 11,66,21,000 భారం తొలుగుతుంది. అలాగే జిల్లాలో 39,895 మంది ఉజ్వల కనెక్షన్‌దారులున్నారు.వీరికి ఒక్కో సిలిండర్‌పై రూ.400 తగ్గింపుతో 1,59,58,000 భారం తప్పుతుంది. జిల్లా మొత్తంగా 6,23,000 మంది గ్యాస్ కనెక్షన్ దారులకు రూ. 13.25 కోట్ల భారం నుంచి విముక్తి కలగనుంది.

ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

- నిర్వహణకు రూ.3కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి
- జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు సూచన



హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, చిత్రంలో ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని,హాఫీజ్‌ఖాన్, సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్. సంజీవకుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆసుపత్రిలో నిర్వహణకు ప్రభుత్వం ప్రస్తుతం రూ.3 కోట్లను విడుదల చేసిందని, వీటిని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఖర్చు చేయాలని సూచించారు. మంగళవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అమలు చేసిన పనులను చదివి వినిపించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను రోగులకు అవసరమైన టాయ్‌లెట్ మరమ్మతులు, ఎలక్ట్రికల్ వర్క్స్, ఫ్లోరింగ్, ప్లంబింగ్, లిఫ్టులు, సీసీ కెమెరాలు, ఏసీల మరమ్మతు తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇంజనీర్లను ఆమె ఆదేశించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద వచ్చే నిధులను ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు కూడా క్లెయిమ్ చేసే పరిస్థితి తీసుకురావాలన్నారు. సర్కారు ఆసుపత్రుల్లో మంచి వైద్యం లభిస్తుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి అధికారులకు ఆదేశించారు.

సోలార్ ఎనర్జీకి ఎందుకంత ధర?

కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్. సంజీవకుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల కింద పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందికి చట్టప్రకారంగా ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ ఎంత మందికి చెల్లిస్తున్నారనే వివరాలు వారంలోగా ఇవ్వాలన్నారు. ఆసుపత్రిలో సోలార్ ఎనర్జీ సరఫరా చేస్తున్న వ్యక్తికి మార్కెట్ ధర కంటే ఎక్కువగా చెల్లిస్తున్నారని మండిపడ్డారు. ఆసుపత్రి నుంచి ప్రతి నెలా రూ.6.50 లక్షలు వసూలు చేస్తున్నారని, దీనికి కొలమానం లేదన్నారు. కర్నూలు సమీపంలోనే అతి పెద్ద సోలార్ పార్క్ ఉందని, వారిని కోరితే ఉచితంగానే ఆసుపత్రికి సోలార్ విద్యుత్ ఇస్తారని చెప్పారు. ఆసుపత్రి ఆవరణలో ఎంపీ ల్యాడ్స్ కింద వాటర్ డిస్పెన్సింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు వంద చదరపు అడుగుల స్థలాన్ని గుర్తించాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద డేటా ఎంట్రీకి ఒక ఫైలుకు రూ.939 చాలా ఎక్కువన్నారు. ఆసుపత్రిలో కనీసం పది జన ఔషధి స్టోర్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రైవేటు ఏజెన్సీల నిర్వహణపై అసంతృప్తి

ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ పార్కింగ్ ఫీజులు వసూలు చేయకుండా వాహనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు కోరారు. ఇప్పటికే మందులు, పరీక్షలు బయటకు రాసివ్వడం వల్ల రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం, డైట్, సెక్యూరిటీ, వాషింగ్, మెడికల్ షాప్స్ తదితర ఏజెన్సీల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇవి సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు.

బిల్లులు చెల్లించని ఏజెన్సీలపై ఆగ్రహం

ఆసుపత్రిలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్, డయాలసిస్ తదితర సేవలను అందిస్తున్న ప్రమోదిని, ఎస్ఎల్ డయాగ్నోస్టిక్స్, నెఫ్రోప్లస్ ఏజెన్సీలు ఎలక్ట్రిసిటీ వినియోగ బిల్లులు చెల్లించకపోవడంపై కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులకు, ఆసుపత్రికి ఏం సంబంధమని ప్రశ్నించారు. ప్రభుత్వం 15 రోజుల కిందటే బిల్లులన్నీ చెల్లించినా లక్షల రూపాయల పవర్‌బిల్లులను చెల్లించకపోవడమేమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆక్సిజన్ రేటు ఎందుకు ఎక్కువ...?

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ జనరల్ వార్డుల్లో రోగుల టాయ్‌లెట్స్ నిర్వహణ సరిగ్గా లేదని, వైద్యుల టాయ్‌లెట్స్ లాగా రోగుల టాయ్‌లెట్స్ కూడా శుభ్రంగా ఉండాలన్నారు. పేయింగ్‌బ్లాక్‌కు సంబంధించిన భవనాన్ని మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని సూచించారు.

ఏఎంసీలో ఏసీలు పనిచేయడం లేదు


కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ ఏఎంసీలో లైట్‌లు, ఏసీలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరోనా సమయంలో ప్రారంభించిన ఆక్సిజన్ ప్లాంట్స్ పనిచేస్తున్నాయా అని ఆరా తీశారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు 11,085 కొత్త పింఛన్లు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక కింద ఉమ్మడి కర్నూలు జిల్లాకు 11,085 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ఈ మేరకు సెర్ప్ ముఖ్య కార్య నిర్వహణాధికారి(సీఈఓ) ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా పాస్ పుస్తకాలు వెంటనే ముద్రించాలని సెర్ప్ సీఈఓ డీఆర్‌డీఏ–వైకేపీ అధికారులను ఆదేశించారు. 2022 డిసెంబర్ 1 నుంచి ఈ ఏడాది మే 31వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాలు, మండల పరిషత్/ మున్సిపాలిటీలలో ఆమోదించి అప్‌లోడ్ చేసిన కొత్త పింఛన్ల డేటాపై వెరిఫికేషన్ జరిగింది. ఇందులో అర్హులైన వారందరికీ పింఛను మంజూరైంది. కర్నూలు జిల్లాకు 6,122, నంద్యాల జిల్లాకు 4,963 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ఎలాంటి సిఫార్సులు లేకుండా, ఎవరికీ ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడం విశేషం. ఈ ఏడాది జనవరిలో ఉమ్మడి జిల్లాకు 15,289 కొత్త పింఛన్లు మంజూరు కాగా.. ప్రస్తుతం మరో 11,085 పింఛన్లు మంజూరు చేయడం విశేషం. కొత్త పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేస్తోందని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు.

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెరగాలి

- పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లాపరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్‌లోని డీపీఆర్‌సీ భవనం, నందికొట్కూరు రోడ్డులోని ప్రేమగిరిలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు స్థానిక స్వపరిపాలన గురించి తెలుసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి, వాటి ప్రాముఖ్యత, విధి విధానాలను సభ్యులకు తెలియజేయాలన్నారు. గ్రామ సభలో చేసిన తీర్మానాలకు అనుగుణంగా ఆయా గ్రామ పంచాయతీల్లో పనులు చేపట్టాలన్నారు. శిక్షణ కార్యక్రమాల్లో ఉమ్మడి జిల్లాల శిక్షణ పర్యవేక్షకులు వెంకటరత్నం, కర్నూలు, నంద్యాల జిల్లాల పంచాయతీ అధికారులు టి.నాగరాజు నాయుడు, మంజులవాణి, కర్నూలు డీఎల్‌పీఓ తిమ్మక్క, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, రాజవర్ధన్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సహాయ పరికరాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిల్, వీల్ చైర్, చంక కర్రలు, బ్యాటరీతో నడుపు మూడు చక్రాల సైకిల్, శ్రవణ యంత్రం, అంధుల చేతి కర్రలు తదితర సహాయ పరికరాలు అందించేందుకు గుర్తింపు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా తెలిపారు. ఈ నెల 31న జిల్లా పరిషత్ ప్రాంగణంలో, సెప్టెంబర్ 2న ఎమ్మిగనూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయా పరికరాలు అందించేందుకు దివ్యాంగులను ఎంపిక చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులు సదరం ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు, వికలత్వంతో ఉన్న రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. బ్యాటరీ మూడు చక్రాల సైకిల్ అవసరమైన వారికి 80 శాతం వికలత్వం ఉండాలన్నారు.

పెద్దాసుపత్రిలో పాము కలకలం



పామును చంపుతున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం పాము కలకలం రేపింది. ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం వద్ద పాము కనిపించడంతో అక్కడే ఉన్న రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది ఆందోళన చెందారు. వెంటనే సిబ్బంది దానిని గుర్తించి చంపివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ విభాగం వెనుక భాగంలో చెత్తాచెదారం ఎక్కువగా ఉండటం, ముళ్లకంపలు, చెట్లు ఉండటంతో పాములకు ఆవాసంగా మారింది. ఈ ప్రాంతంలో తరచూ పాములు కనిపిస్తుంటాయని సిబ్బంది చెప్పారు. ఆసుపత్రిలో పనిచేసే పెస్ట్ కంట్రోల్ సిబ్బంది సైతం పలుమార్లు పాములను గుర్తించి చంపివేశారు.

ఓపెన్ స్కూల్ విద్య.. బంగారు భవిత!

- రెగ్యులర్ కోర్సులతో సమానం
- జిల్లాలో 42 స్టడీ సెంటర్లు
- ఓపెన్‌స్కూల్‌లో పది, ఇంటర్మీడియెట్ కోర్సులు
- ఉద్యోగ, పదోన్నతులకు అవకాశం
- అడ్మిషన్లకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు



ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ఉన్న కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల



ఓపెన్‌స్కూల్ ద్వారా విద్యార్థులకు విద్య బోధిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పాఠశాలల్లో రెగ్యులర్ చదువుకునే అవకాశం లేని పిల్లలు, వయోజనులు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగ పదోన్నతులు పొందేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓపెన్‌స్కూల్ సొసైటీ) వరంగా మారింది. దూర విద్యా విధానంలో పది, ఇంటర్ కోర్సులు పూర్తి చేసుకునేందుకు ఏటా ప్రభుత్వం ఓపెన్ స్కూళ్లు నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు అనుబంధంగా ఓపెన్‌స్కూల్ స్టడీ సెంటర్లు కొనసాగుతున్నాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 42 స్టడీ సెంటర్ల ద్వారా ఓపెన్‌స్కూల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల కావడంతో పది, ఇంటర్ కోర్సులకు అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. రెగ్యులర్ కోర్సులకు సమానంగా ఓపెన్ స్కూల్ ద్వారా విద్యనందిస్తున్నారు. జిల్లాలోని ఆయా స్టడీ సెంటర్లలో పదవ తరగతిలో ఆరు సబ్జెక్టులు, ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఓపెన్‌స్కూల్ ద్వారా ఇచ్చే సర్టిఫికెట్‌కు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు నిండిన పిల్లలు పదవ తరగతి అడ్మిషన్‌కు అర్హులు. ఎలాంటి గరిష్ట వయో పరిమితి లేదు. చదవటం, రాయడం తెలిసి ఉండాలి. ఇంటర్ చేరే విద్యార్థులు పదవ తరగతి పాసై రెండేళ్లు పూర్తి అయి ఉండాలి. రెండేళ్ల వ్యవధిలేని విద్యార్థులు ఐదు సబ్జెక్టులు ఒకసారి, మిగిలిన మరో సబ్జెక్టు మరో ఏడాది పరీక్ష రావాల్సి ఉంటుంది. పదవ తరగతి చేరే పిల్లలు దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టినతేదీ ధ్రువీకరణపత్రం, ఇంటర్‌లో చేరేందుకు పదవ తరగతి మార్కుల జాబితా, టీసీ, దరఖాస్తుఫాంతోపాటు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కులధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులు కులధ్రువీకరణ పత్రాలతోపాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతిలో 1,960 మంది విద్యార్థులు, 570 మంది ఇంటర్ విద్యార్థులు అడ్మిషన్లు పొంది పరీక్షలు చేశారు.

దరఖాస్తు ఇలా:

జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాలతోపాటు పాణ్యం మండలంలోని పాణ్యం, గడివేముల మండలాల్లో 42 స్టడీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. పది, ఇంటర్‌లో చేరే విద్యార్థులు ఆయా కేంద్రాల్లోని ఏఐ కోఆర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, అడ్మిషన్ ఫీజు చెల్లించాలి. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. పదో తరగతిలో జనరల్ విద్యార్థులు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ. 1,400, అన్ని వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ కలిపి రూ. వెయ్యి చెల్లించాలి. ఇంటర్ చేరే జనరల్ విద్యార్థులు రూ. 1,600, మిగిలిన అన్ని వర్గాల విద్యార్థులు రూ. 1,300 చొప్పున ఫీజు చెల్లించాలి. ఈ ఫీజులకు అదనంగా మీ సేవ చార్జీల రూపంలో రూ. 36 చార్జ్ చేయాలి.

ఓపెన్‌స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తి



పదవ తరగతి పూర్తి చేసుకుని ఆర్మీలో జవాన్‌గా చేరి 18 సంవత్సరాలపాతటు దేశసేవ చేశాను. రిటైర్డ్ అయి వచ్చాక ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తి చేశాను. దూర విద్యద్వారా ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాను. రెగ్యులర్‌గా చదవలేకపోయినా ఓపెన్ స్కూల్ ద్వారా డిగ్రీ పట్టా తీసుకోవాలన్నదే లక్ష్యం.

– రవికుమార్‌రెడ్డి, మాజీ సైనిక ఉద్యోగి, ఉయ్యాలవాడ

అడ్మిషన్లు జరుగుతున్నాయి



స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 15 సంవత్సరాల నుంచి ఓపెన్‌స్కూల్ స్టడీ సెంటర్ అందుబాటులో ఉంది. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 40 మంది ఇంటర్‌లో 24 మంది అడ్మిషన్లు పొంది పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ఇప్పటి వరకు పదిహేను మంది అడ్మిషన్లు పొందారు. పది, ఇంటర్‌లో చేరే విద్యార్థులు సార్వత్రిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసులు, ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్, కోవెలకుంట్ల

సబ్జెక్టులు, తరగతుల వివరాలు ఇలా..

- పదోతరగతికి గ్రూప్- ఏలో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు/హిందీ/తమిళం/ ఒరియా తీసుకోవచ్చు. గ్రూప్-బీలో గణితం, సైన్స్, సోషియల్ తీసుకోవాలి.
- ఇంటర్‌లో గ్రూప్-ఏలో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు/హిందీ/తమిళం/ ఒరియా తీసుకోవచ్చు. గ్రూప్-బీలో ఆయా గ్రూపులకు సంబంధిచి ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంది.
- ఆయా స్టడీ సెంటర్లలో స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంటుంది. ఓపెన్ స్కూల్ అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యన కేంద్రాల్లో 30 తరగతులు నిర్వహిస్తారు.
- కనీసం 20 తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్ నెలలో నిర్వహించే వార్షిక పరీక్షలకు అనుమతిస్తారు.
- రెగ్యులర్ పాఠశాలల్లో పదోతరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలల్లో చేరి సులభంగా ఉండే సబ్జెక్టులను ఎంపిక చేసుకుని పాసయ్యే అవకాశం ఉంటుంది.
- రెగ్యులర్ పదోతరగతి, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్లలోపు ఓపెన్‌స్కూల్‌లో చేరితే రెగ్యులర్‌గా పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టు మార్కులను బదలాయించుకునే వీలుంటుంది.
- పదిలో హిందీ సబ్జెక్టు మార్కులను మాత్రం బదలాయించరు. పదో తరగతి ఉత్తీర్ణతతనే ఉద్యోగాలు చేస్తున్న ఉద్యోగులు ఇంటర్, ఆపై చదువులు సార్వత్రిక విద్యద్వారా పూర్తి చేసుకుని పదోన్నతులు పొందే అవకాశం ఉంది.

ఈ ఏడాది 60వేల పెయ్య దూడల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24 సంవత్సరంలో రాష్ట్రంలో 60వేల పెయ్య దూడల అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఆయన బనవాసిలోని ఘనీకృత వీర్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మంగళవారం కర్నూలులోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లింగనిర్ధారిత వీర్యంతో ఇప్పటి వరకు ఎన్ని పశువులకు కృత్రిమ గర్భధారణ జరిగింది.. ఎన్ని పెయ్య దూడలు పుట్టాయనే విషయమై సమీక్ష నిర్వహిచారు. లింగనిర్ధారిత వీర్యంతో చేసిన కృత్రిమ గర్భధారణతో 98శాతం పెయ్య దూడలు పుట్టడం పట్ల చైర్మన్ హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచేందుకు పెయ్య దూడల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు పాల వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. బనవాసిలోని ఘనీకృత వీర్య కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయడంలో భాగంగా రూ.1.35 కోట్లతో సెమన్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి, వైఎస్‌ఆర్ జిల్లా చైర్మన్ మాధవరెడ్డి, చిత్తూరు జిల్లా చైర్మన్ సంతోష్‌కుమార్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ జడ్జి వెంకట హరినాథ్

కర్నూలు(లీగల్): జిల్లా కోర్టు ఆవరణలో ఇటీవల కొత్తగా ఏర్పాటైన శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని శాశ్వత లోక్ అదాలత్ జడ్జి వెంకట హరినాథ్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావుతో కలసి న్యాయ సేవా సదన్‌లో శాశ్వత లోక్ అదాలత్‌పై అన్ని శాఖల అధికారులతో చట్టపరమైన అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదాన్ని ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందించే ఉద్దేశంతో శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటైందన్నారు. ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదని తెలిపారు. ఎలాంటి సేవా లోపం గానీ, నష్టం, అన్యాయం జరిగితే తక్షణమే శాశ్వత లోక్ అదాలత్‌లో వినతిపత్రంతో పాటు తగిన ఆధారాలు సమర్పిస్తే న్యాయం చేకూరుస్తామన్నారు.

రాముడు మంచి వ్యక్తి

- ఆటోలో వెళ్తూ బంగారు నగలను పోగొట్టుకున్న వృద్ధురాలు
- దొరికిన ఆభరణాలను బాధితురాలికి అప్పగించిన వ్యక్తి
- అభినందిస్తున్న గ్రామస్తులు



బాధితులకు బంగారు నగలు అందిస్తున్న రాముడు (టవల్ వేసుకున్న వ్యక్తి)

కొత్తపల్లి: రహదారిపై దొరికిన దాదాపు రూ.1.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను ఓ వ్యక్తి బాధితురాలికి అప్పగించి నిజాయితీ చాటుకున్నా డు.ఈ ఘటన మండలంలోని సింగరాజుపల్లె గ్రా మంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నా యి. కొత్తపల్లి మండలం ముసలమడుగు గ్రామానికి చెందిన కొండాగుల మైరున్‌బీ అనే మహిళ కంటి ఆపరేషన్ చేయించుకునేందుకు సోమవారం నంద్యాలకు ఆటోలో బయలుదేరింది. అయితే ఇంట్లో ఉన్న మూడు తులాల బంగారు నక్లీసు, కమ్మల బుట్టాలు, పట్టీలను ఆత్మకూరులోని తన కుమార్తె షహనాబీకి అప్పగించేందుకు బుట్టలో పెట్టుకుని వెంట తీసుకెళ్లింది. కాగా మార్గమధ్యలో బుట్ట ఆటోలో నుంచి సింగరాజుపల్లి గ్రామ సమీపంలో పడిపోయింది. అదే గ్రామానికి చెందిన సోమేశ్వరుడు పొలానికి వెళ్తుండగా బుట్టను గమనించి చూడగా అందులో బంగారు ఆభరణాలు ఉండటంతో తండ్రి రాముడికి అప్పగించాడు. ఆ బుట్టలో ఆధార్ కార్డు ఉండటంతో వెంటనే ముసలమడుగు గ్రామంలో తన బంధువులకు సమాచారం తెలిపాడు. దీంతో బాధితులు మంగళవారం ఉదయం సింగరాజుపల్లె గ్రామానికి చేరుకుని రాముడి నుంచి బంగారు ఆభరణాలు అందుకుని కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీ చాటిన రాముడు, అతడి కుమారుడు సోమేశ్వరుడిని గ్రామస్తులు అభినందించారు.

డీఎడ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

కర్నూలు సిటీ: ఈ ఏడాది జూన్ 19 నుంచి 24వ తేది వరకు నిర్వహించిన డీఎడ్ ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు డీఈఓ డా.వి. రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3,885 మంది ఛాత్రోపాధ్యాయులు పరీక్షలకు హాజరుకాగా, 2,480 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. రీకౌంటింగ్‌కు వచ్చే నెల 9వ తేదీవరకు గడువు ఉందన్నారు.

విదేశీ సిగరెట్ల అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు



అక్రమంగా నిల్వ ఉంచిన సిగరెట్లను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు : విదేశీ సిగరెట్ల అక్రమ నిల్వలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. నంద్యాల పట్టణంలో కొంతమంది వ్యాపారులు విదేశాల నుంచి సిగరెట్లను దిగుమతి చేసుకుని పన్ను ఎగ్గొట్టి అక్రమంగా వ్యాపారం సాగిస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి నీలం పూజితకు సమాచారం అందింది. ఆమె ఆదేశాల మేరకు మంగళవారం విజిలెన్స్ అధికారులు నాగరాజు యాదవ్, సునిల్‌కుమార్, వెంకట నారాయణ, రూఫస్, హనుమంతయ్య, యుగంధర్‌రెడ్డి తదితరులు బృందంగా ఏర్పడి నంద్యాల పట్టణంలోని యల్లన్నపేటలోని సుభాన్ ఏజెన్సీ, సుభాన్ ట్రేడర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రెండు దుకాణాల్లో రూ.5.31 లక్షలు విలువ చేసే విదేశీ కంపెనీ సిగరెట్లను గుర్తించి సీజ్ చేశారు. సయ్యద్ ఖాద్రి, అమీర్ హుసేన్, ఆరిఫ్ హుసేన్, శివలపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు నంద్యాల ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

తూనిక యంత్రాలకు సీళ్లు తప్పనిసరి



ఎలక్ట్రానిక్ యంత్రాలకు సీళ్లు వేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్

కర్నూలు (న్యూసిటీ): వ్యాపారులు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలకు సకాలంలో సీళ్లు వేయించుకోవాలని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ సూచించారు. ఓర్వకల్లు, కల్లూరు మండల కేంద్రాల్లో పలు షాపులను తనిఖీ చేసి యంత్రాలను పరిశీలించారు. 150 ఎలక్ట్రానిక్ యంత్రాలకు సీళ్లు వేశారు. ఏడాదికోసారి తప్పనిసరిగా సీళ్లు వేయించుకోవాలని, అరిగిపోయిన కాటా రాళ్లు మార్చుకోవాలని వ్యాపారులకు ఇన్‌స్పెక్టర్ సూచించారు.

వచ్చే నెల 1న జాబ్ మేళా

కర్నూలు సిటీ: వచ్చే నెల 1న శ్రీశంకరాస్ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీకాంత్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు నిరుద్యోగులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందన్నారు. ఎస్.వీ.సీ సినిమాస్, ముత్తూట్ ఫైనాన్స్, ఆరోరా ఫార్మా కంపెనీల యజమానులు హాజరై తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకుంటారన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు www.aprrdc.in వెబ్‌లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9676141731, 9059290821 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సమరభేరీ

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరభేరీ మోగించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రోజురోజుకు అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్‌చార్జీలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా సమస్యలపై స్పందించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వాలను మేలుకొల్పేందుకు సీపీఎం ఆధ్వర్యంలో సమరభేరీ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సమరభేరీ పోస్టర్లను సీపీఎం నాయకులు జి.రామకృష్ణ, పీఎస్ రాధాకృష్ణ, టి.రాముడు విడుదల చేశారు.

మట్టి తవ్విన వారిపై చర్యలు తీసుకుంటాం

కర్నూలు (న్యూసిటీ): గూడూరు మండలం పొన్నకల్ గ్రామానికి చెందిన షేక్ రజియాబీ పొలంలో మట్టి తవ్విన వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. బాధితురాలు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేయడంతో తమ సిబ్బంది పొలం వద్దకు వెళ్లి పరిశీలించి, నివేదిక తయారు చేశారన్నారు. పరిశీలించి నిందితుల నుంచి బాధితురాలికి పరిహారం ఇప్పిస్తామన్నారు.

నేడు నగర పాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో బుధవారం ఉదయం నగర పాలక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మేయర్ కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశంలో ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్లు, కోఆప్షన్ మెంబర్లు, కార్పొరేటర్లు, వివిధశాఖల అధికారులు పాల్గొననున్నారు.

మున్సిపల్ స్కూల్‌కు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

కర్నూలు (టౌన్): నగరంలోని లేబర్ కాలనీలో ఉన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్మారక ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని 18 క్రీడాంశాల్లో బాల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించగా ఈ పాఠశాలకు చెందిన క్రీడాకారులు 82 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచారు. దీంతో ప్రధానోపాధ్యాయుడు ఎస్.రాజేశ్వరరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు సరళకు డీఈఓ డాక్టర్ రంగారెడ్డి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుతో పాటు మెమోంటో, శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అధ్యక్షులు లక్ష్మయ్య పాల్గొన్నారు.

షాపుల వేలంలో రిజర్వేషన్ కల్పించాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో మున్సిపల్ షాపుల వేలం ప్రకటనలో 10 శాతం ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తింపజేయాలని ఓసీ జేఏసీ స్టీరింగ్ కమిటీ నాయకులు హరీష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఓసీ జేఏసీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం మేయర్ బీవై రామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓసీ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు పల్లె శ్రీధర్ రెడ్డి, రాయపాటి శ్రీనివాస్, టి.ప్రతాప్ రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవహారిక భాషకు వారధి గిడుగు





శ్రీచైతన్య స్కూల్‌లో మాట్లాడుతున్న రచయిత ఎలమర్తి రమణయ్య, వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్న కేశవరెడ్డి స్కూల్ విద్యార్థులు, వ్యవస్థాపక అధ్యక్షులు కేశవరెడ్డి

కర్నూలు సిటీ/కల్చరల్: వ్యవహారిక భాషకు వారధి గిడుగు రామ్మూర్తి పంతులని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగుభాషా దినోత్సవాన్ని నగరంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో వివిధ వేషధారణల్లో విద్యార్థులు అలరించారు.

- సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకల్లో రచయిత చంద్రశేఖర్ కల్కూర, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్‌లు హాజరయ్యారు.
- కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర శాంతి, రాయలసీమ యూనివర్సిటీ రిటైర్డ్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, శాంతి సాహితీ సంస్థ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, కాలేజీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ లత, జి.ప్రమీల, డాక్టర్ దండ బోయిన పార్వతిదేవి పాల్గొన్నారు.
- ప్రకాష్ నగర్‌లోని టంగుటూరు ప్రకాశం పంతులు పాఠశాలలో నిర్వహించిన రామ్మూర్తి పంతులు జయంతి వేడుకల్లో హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు సుధారాణి, సుదేష్ణ రాణి, వకుళాదేవి, శ్రీదేవి, సాలమ్మ పాల్గొన్నారు.
- వీఆర్ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో జరిగిన గిడుగు వేడుకల్లో లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, విశ్రాంత ఎస్‌ఐ రమణ గౌడ్ పాల్గొన్నారు.
- గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కవన విజయం సాహిత్య రూపక ప్రక్రియ ఆకట్టుకుంది. గిడుగు పాత్రధారిగా ఇనాయతుల్లా వ్యవహరించగా డాక్టర్ సి.నారాయణరెడ్డిగా ఎస్.మహమ్మద్ మియా, కాళ్లకూరి నారాయణరావుగా పత్తి ఓబులయ్య, దివాకర్ల తిరుపతి శాస్త్రి పాత్రలో కె.బాల వెంకటేశ్వర్లు జంట కవులలో ఒకరైన వెంకట కవిగా శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశ్రీ పాత్రలో డాక్టర్ మధుసూదనాచారి, మొల్ల కవయిత్రి పాత్రలో డాక్టర్ చంద్రమౌళిని పోషించారు.
- ఆదర్శ విద్యా మందిర్ ప్రైమరీ, హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో స్కూల్ కరస్పాండెంట్ బి.తిమ్మయ్య యాదవ్, డైరెక్టర్ బి.హరికిషన్ పాల్గొన్నారు.
- బుధవారపేటలోని శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో స్కూళ్ల ఏజీఎం సురేష్‌కుమార్, రచయిత ఎలమర్తి రమణయ్య పాల్గొన్నారు.
- నగరంలోని కేశవరెడ్డి విద్యా సంస్థల్లో జరిగిన వేడుకల్లో ఆ విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు కేశవరెడ్డి పాల్గొన్నారు.



సిల్వర్ జూబ్లీలో గిడుగు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న రచయిత చంద్రశేఖర్ కల్కూర, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ తదితరులు



లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో



టంగుటూరు ప్రకాశం పంతులు పాఠశాలలో..



ఆదర్శ విద్య మందిర్‌లో..



కేవీఆర్ డిగ్రీ కాలేజీలో..



టీజీవీ కళాక్షేత్రంలో మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మహిళలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం రాత్రి ఆయన స్థానిక 46వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అశోక్ నగర్, పాల కొట్టాల ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పుకున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా తీసుకొచ్చిన పథకాలను సమీపంలోని సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వాసు, పార్టీ నాయకులు ప్రసాద్, ప్రభుదాస్, యూసుఫ్, మల్లి, హసీనా, ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీపీ వెంకటేష్



సీపీ వెంకటేష్‌కు నియామకపత్రం అందిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీపీ వెంకటేష్‌ను నియమించినట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్లో చూపిస్తున్న చొరవను చూసి ఆయనకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, సంఘం జాతీయ కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వేంపెంట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అజీజ్‌కు 'హంస' పురస్కారం ప్రదానం



అతిథుల చేతుల మీదుగా హంస పురస్కారం అందుకుంటున్న రచయిత అజీజ్

కర్నూలు కల్చరల్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని హంస పురస్కారం–2023ను జిల్లా నవలా రచయిత ఎస్.డి.వి. అజీజ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ ప్రదానం చేసింది. తెలుగు సాహిత్యంలో విశేష సేవలు అందించిన అజీజ్‌కు మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో జరిగిన మాతృభాష దినోత్సవంలో రాష్ట్ర పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖా మాత్యులు కారుమూరు వెంకటనాగేశ్వరరావు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మజ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

నేత్రదానికి ముందుకు రావాలి



మాట్లాడుతున్న డాక్టర్ జి.భరత్

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ప్రతి ఒక్కరూ నేత్రదానికి ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ జి.భరత్ సూచించారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎ.క్యాంపులోని ఇందిరాగాంధీ స్మారక మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు డాక్టర్ జి.భరత్ నేత్రదానం విశిష్టతను, ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి కంటి వైద్యున్ని సంప్రదించి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. తినే ఆహారంలో ఆకుకూరలు, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, గుడ్లు, చేపలు, పాలు, విటమిన్లు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. నేత్రదానం చేసేందుకు అన్ని వయస్సుల వారు అర్హులేనని, బీపీ, షుగర్ వ్యాధులు ఉన్నా నేత్రదానం చేయవచ్చన్నారు. కుక్కకాటు, రేబిస్ వ్యాధి, హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారు మాత్రం నేత్రదానం చేయకూడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, వైద్యులు సృజన, సుభాన్, పరమేశ్వరరెడ్డి, బి.కవిత తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతోనే నైపుణ్యాల అభివృద్ధి

- పశుసంవర్థకశాఖ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం

కర్నూలు(అగ్రికల్చర్): పశువైద్యుల్లో వృత్తి నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసేందుకు శిక్షణా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని పశుసంవర్ధకశాఖ అడిషనల్ డైరెక్టర్, విశాఖపట్టణం స్టైల్ డైరెక్టర్ సింహాచలం సూచించారు. మంగళవారం ఆయన కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల, ప్రాంతీయ శిక్షణా కేంద్రాన్ని తనిఖీ చేశారు. వెటర్నరీ పాలీ క్లినిక్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రతి రోజు ఓపీకి ఎన్ని పశువులు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బహుళార్థ పశువైద్య శాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీపీసీ డీడీ హేమంత్‌కుమార్, కర్నూలు డివిజన్ డీడీ దర్గా ప్రసన్నబాబు, ప్రాంతీయ శిక్షణా కేంద్రం ఏడీ సుధాకర్‌రెడ్డి, వీపీసీ ఏడీలు సుధాకర్, చంద్రలీల, విజయభాస్కర్, జేడీ కార్యాలయం ఏడీ భవాణిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అడిషినల్ డైరెక్టర్ సింహాచలం

అటల్ పెన్షన్ యోజనలో జిల్లా టాప్

- జిల్లా అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వాములు కావాలి
- కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ



మాట్లాడుతున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(అర్బన్): అటల్ పెన్షన్ యోజన పథకానికి 53,913 మంది లబ్ధిదారులను చేర్పించడం ద్వారా రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవతేజ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో జిల్లాలోని బ్యాంకు అధికారులతో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవతేజ మాట్లాడుతూ అర్హత ఉన్న లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చి ప్రోత్సహించాలన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు మార్టిగేజ్ డాక్యుమెంట్ సదుపాయం ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలన్నారు. కెనరా బ్యాంకు సహకారంతో సెల్‌ఫోన్ రిపేర్లు, సర్వీసు, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సీసీటీవీ సర్వీసింగ్ తదితర శిక్షణా కార్యక్రమాలు పొందిన యువత తమ సర్టిఫికెట్లను బ్యాంకులకు అందించి రుణాలు పొంది స్వయం సమృద్ధి సాధించాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి రూ.4,550.92 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగానికి రూ.3641.72 కోట్లు మంజూరు చేశామని, రాబోయే మూడు త్రైమాసికాలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆయన జిల్లాలోని బ్యాంకు అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, కెనరా బ్యాంకు ఆర్‌ఎం ఏపీ రావు, ఆర్‌బీఐ లీడ్ బ్యాంకు ఆఫీసర్ నాగప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేయాలి

– జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి

కల్లూరు: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి బూత్ లెవల్ అధికారులకు సూచించారు. మంగళవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల తొలగింపు ప్రక్రియ గురించి ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌బాబుతో కలిసి కల్లూరు అర్బన్ పరిధిలోని ముజఫర్‌నగర్‌లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు: మండల పరిధిలోని కేతవరం గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మూలస్వాములు (68) కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 20న ఇంట్లో గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగడంతో ఆర్పడానికి వెళ్లిన మూల స్వాములకు తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని కుమారుడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'విశ్వ కళా సమతి' నూతన కార్యవర్గం



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: విశ్వ కళా సమతి నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం మార్కెట్ యార్డ్‌లోని కార్యాలయంలో జరిగింది. సమితి అధ్యక్షులుగా ఎం.బీసన్న, కార్యదర్శిగా ఇ.నాగరాజు, కోశాధికారిగా టి.సి.కేసన్న, గౌరవాధ్యక్షులుగా గాండ్ల లక్ష్మన్న, ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎం.రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా ఆర్.లక్ష్మణ రాజులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమానికి, నాటకాల ప్రదర్శనకు సహకరిస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

వచ్చే నెల 1న ఉమ్మడి జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): సెప్టెంబర్ 1న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల విభాగంలో షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఈశ్వర్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించనున్న సీనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 7013886343 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మునికుమార్ తెలిపారు. గాత్రం, వయోలిన్, నాదస్వరం, మృదంగం, డోలు, కూచిపూడి నృత్య విభాగాల్లో ఈ నెల 31వ తేదీలోపు ప్రవేశాలు పొందవచ్చన్నారు. రూ.100 ఫైన్‌తో సెప్టెంబర్ 30వ తేదీ వరకు ప్రవేశం పొందవచ్చన్నారు. జులై 1, 2023 నాటికి 10ఏళ్ల వయస్సు నిండిన వారు అర్హులన్నారు.

గోరక్షణ మహా సంఘం ధర్మకర్తల మండలి నియామకానికి..

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ పరిధిలోని జిల్లా గో రక్షణ మహా సంఘం ధర్మ కర్తల మండలి నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గోశాల ఈఈ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 15వ తేదీలోగా మద్దూరు నగర్‌లోని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్ కాపీ, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలను పంపాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు: నగర శివారులోని లేబర్ కాలనీలో నివాసముంటున్న గణేష్ (25) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గణేష్ గౌండ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా మత్తుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతూ ఆర్థికంగా చితికిపోయి తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి అనురాధ ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బిల్లులు వసూలు చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు వంద శాతం వసూలు చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. మంగళవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెలవారీ బిల్లుల జారీ ప్రక్రియ పూర్తయి 20 రోజులైందని, ఇంకా లక్ష్యం చేరని అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాత బిల్లుల బకాయిల వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ శాఖల బకాయిలు రాబట్టేలా ఆయా శాఖల అధికారులతో మాట్లాడాలన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): నెల్లూరులో సెప్టెంబర్ 12, 13, 14 తేదీల్లో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఈ.శ్రీరాములు గౌడ్ కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తోందని విమర్శించారు. మహాసభల్లో విద్యా పరంగా నెలకొన్న సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. కార్యక్రమంలోనాయకులు డి.సోమన్న, ఎస్, షాబీర్ బాషా పాల్గొన్నారు.